సాక్షి జోగులాంబ గద్వాల

గురువారం । 6 । మార్చి । 2025



పోటెత్తిన ఉల్లి

దేవరకద్ర మార్కెట్ బుధవారం ఉల్లి కుప్పలతో నిండిపోయింది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (గురువారం సాయంత్రం)

సహర్ 5-10 (శుక్రవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.9 /18.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి భవన్‌లో గద్వాల చేనేత చీరల ప్రదర్శన



గద్వాలటౌన్ : రాష్ట్రపతి భవన్‌లో గద్వాల చేనేత చీరల ప్రదర్శన ఆకట్టుకుంది. 'అమృత్ కా మహోత్సవ్' లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందిన హస్తకళలు, హ్యాండ్లూమ్, అథెంటిక్ సౌత్ ఇండియా ఫుడ్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. ఖండాంతర ఖ్యాతి పొందిన గద్వాల చేనేత జరీ చీరలు ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. సంఘం నాయకులు అక్కల శాంతరామ్, అక్కల శ్రీనివాసులు, మంత్రి సురేష్ పాల్గొన్నారు.

టీబీ డ్యాం నుంచి నీటి విడుదల

శాంతినగర్: ఆర్డీఎస్, కేసీ కెనాల్ వాటాగా తుంగభద్ర డ్యాం అందాల్సిన 5వ ఇండెంట్ నీటిని కర్ణాటక అధికారులు బుధవారం విడుదల చేశారు. తొమ్మిది రోజులపాటు నీటిని విడుదల చేయాలని తెలంగాణ, ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు మంగళవారం లేఖలు రాశారు. స్పందించిన కర్ణాటక టీబీ డ్యాం అధికారులు.. ఆర్డీఎస్ వాటాగా 1,500, కేసీ కెనాల్ వాటాగా 2,500 క్యూక్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదిలోకి వదిలారు. నాలుగు రోజుల్లో నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు చేరకుంటాయని ఈఈ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆనకట్ట వద్ద ప్రస్తుతం నాలుగు అడుగుల మేర నీరు ఉందన్నారు. ఎనిమిది అడుగులు దాటితే ఓవర్‌ఫ్లో అయి తుమ్మిళ్ల లిఫ్ట్ వద్దకు చేరుకుంటాయని ఈఈ పేర్కొన్నారు.

బకాయిలపై నజర్

జిల్లాలో రవాణాశాఖ అధికారుల స్పెషల్ డ్రైవ్



ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న ప్రైవేటు స్కూల్ బస్సును సీజ్ చేసిన రవాణాశాఖ అధికారులు (ఫైల్)

- ప్రధాన రహదారులపై విస్తృతంగా తనిఖీలు
- అనుమతి లేకుండా తిరుగుతున్న వాహనాలపై కొరడా
- రూ. 50.61కోట్లకు గాను రూ. 39.38కోట్ల పన్ను వసూలు

గద్వాల క్రైం: వాహనాలకు సంబంధించిన పన్నుల వసూలుపై జిల్లా రవాణాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా సంబంధిత అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కొన్ని రోజులుగా ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. సకాలంలో ట్యాక్స్ చెల్లించని వాహనాలను సీజ్ చేస్తూ.. రెట్టింపు జరిమానా విధిస్తున్నారు. అన్ని రకాల అనుమతి పత్రాలు ఉంటేనే వాహనం రోడ్డెక్కాలని సూచిస్తున్నారు. మరోవైపు ట్యాక్స్ చెల్లించకుండా బకాయి పడిన వాహనదారులకు ఫోన్ ద్వారా లేదా మెసేజ్‌లతో అప్రమత్తం చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 50.61 కోట్ల ట్యాక్స్ వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటి వరకు రూ. 39.38 కోట్లు పన్నుల రూపంలో వసూలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు గాను రవాణాశాఖ అధికారులు ట్యాక్స్ చెల్లించని వాహనదారుల భరతం పడుతున్నారు.

బకాయిలే లక్ష్యంగా..

రవాణాశాఖకు ట్యాక్స్‌లు చెల్లించని వాటిలో ట్రాక్టర్లు, మ్యాక్సీ క్యాబ్‌లు, గూడ్స్ వాహనాలు, ప్రైవేటు స్కూల్ బస్సులు, లారీలు తదితర వాహనాలు ఉన్నాయి. ఏడాదిలో నాలుగుసార్లు ట్యాక్స్ చెల్లించాల్సి ఉన్నా.. కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని మానవపాడు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రవాణాశాఖ సిబ్బంది నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ట్యాక్స్‌లు చెల్లించని వాహనాలను సీజ్ చేసి.. ట్యాక్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపులోగా ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు. మరోవైపు నూతన వాహనాలకు జీవిత పన్ను (లైఫ్ ట్యాక్స్) రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది.

తనిఖీలు నిర్వహిస్తున్నాం..



ట్యాక్స్ చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. సామర్థ్యానికి మించి సరుకులు రవాణా చేస్తున్న గూడ్స్ వాహనాలు, పర్మిట్, ఫిట్‌నెస్ తదితర అనుమతి పత్రాలు లేని వాహనాలకు రెట్టింపు జరిమానాలు విధిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 850 వాహనాలు సీజ్ చేశాం. అందులో ట్యాక్స్ చెల్లించని, ఫిట్‌నెస్ లేని వాటిని గుర్తించాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరలోనే సాధిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీటీఓ

మెసేజ్‌లతో హెచ్చరికలు..

సకాలంలో ట్యాక్స్ చెల్లించని వాహనదారులకు రవాణాశాఖ మెసేజ్‌ల ద్వారా సందేశాలు పంపిస్తోంది. సకాలంలో ట్యాక్స్ చెల్లిస్తే సరే.. లేదంటే రెట్టింపు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తోంది. జిల్లాలో ప్రయాణికులను తరలించే వాహనాలతో పాటు కమర్షియల్ ట్రాక్టర్లు, పాత లారీలు, ప్రైవేటు బస్సులు, గూడ్స్ వాహనాలు చాలా వరకు ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ట్యాక్స్ చెల్లించకుండా వాహనాలు తిప్పడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుంది. ఈ నేపథ్యంలో వివిధ ట్యాక్స్‌లు రవాణా శాఖకు చెల్లించకుండా పెద్ద మొత్తంలో పేరుకుపోయిన బకాయిల వసూలు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అయితే కొన్ని వాహనాలను గ్రామాల్లో మాత్రమే తిప్పుకొని ఇళ్ల వద్ద ఉంచుతున్నారు. అలాంటి వాహనాల విషయంలో నిఘా ఉంచి చర్యలు తీసుకుంటున్నారు. వాహన సామర్థ్యం (ఎఫ్‌సీ), అనుమతి (పర్మిట్), క్వార్టర్ పన్నులు చెల్లించని వివరాలతో ఇప్పటికే బకాయిల జాబితాను రూపొందించుకున్నారు. బకాయిల వసూలుకు అధికారులు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 155 మంది విద్యార్థులు గైర్హాజరు



గద్వాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాలటౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాల్లో 4,235 మంది విద్యార్థులకు గాను 4,080 మంది హాజరయ్యారు. 155 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. 3,415 మంది జనరల్ విద్యార్థులకు గాను 3,304 మంది, 820 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 776 మంది హాజరైన వారిలో ఉన్నారు. విద్యార్థులు నిర్ణీత గడువుకు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోగా.. అధికారులు తనిఖీ చేసి అనుమతించారు. అయితే పరీక్ష కేంద్రాల్లోని కొన్ని గదుల్లో వెలుతురు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. మరికొన్ని గదుల్లో ఫ్యాన్ల కొరత కనిపించింది. ఎండ తీవ్రత, ఉక్కపోత కారణంగా విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఇక్కట్లకు గురయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ కెమెరాల నీడలో పరీక్షలు జరిగాయి. కేంద్రాల్లో తాగునీటి సమస్య లేకుండా జాగ్రతలు తీసుకున్నారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్ విద్యాధికారి హృదయరాజు, ఇతర అధికారుల బృందాలు వేర్వేరుగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ మొగులయ్య, సీఐ టంగుటూరి శ్రీను తదితరులు ఉన్నారు.

సమగ్ర వివరాలు సమర్పించండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల: జిల్లా కేంద్రమైన గద్వాల మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో రూపొందించనున్న నేపథ్యంలో సమగ్ర వివరాలు సమర్పించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌శాఖ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల రూపకల్పనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా డ్రోన్ సర్వే ద్వారా సమగ్ర సమాచారం సేకరించినట్లు తెలిపారు. నివాస ప్రాంతాలు, పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధి జరగబోయే ప్రాంతాలను గుర్తించేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ ప్లానింగ్, ఆరోగ్య, నీటివనరుల నిర్వహణ, పరిశ్రమల స్థాపన తదితర అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమగ్ర సమాచారం అందించాలని ఆదేశించారు. ఆమోదిత మాస్టర్ ప్లాన్ ప్రచురించి.. ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనల అనంతరం తుది ప్రణాళికలను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి వివరణాత్మక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖలు అందించాల్సిన సమాచారం, ఆయా శాఖల బాధ్యతలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలటౌన్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గద్వాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ఆయా శాఖల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల విధులు, పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల స్థితి, పన్నుల వసూలు, ఆదాయ వనరులు, వ్యయాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి పూర్తి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. సిబ్బంది హాజరుకు బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. పార్కుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి.. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలన్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి సారించండి..

మున్సిపల్ ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు దుబార వ్యయాన్ని తగ్గించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆస్తిపన్ను వసూలు లక్ష్యం వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా దుకాణాల అద్దె బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఐడీఎస్ఎంటీ కాలనీలో మిగిలిన ప్లాట్లకు, లీజు గడువు ముగిసిన దుకాణాలకు వేలం నిర్వహించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్లాట్ల వేలంతో వచ్చే ఆదాయంతో కాలనీని అన్నివిధాలా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కాంట్రాక్టు సిబ్బందికి బాధ్యతలు వద్దు..

మున్సిపాలిటీలో కాంట్రాక్టు సిబ్బందికి కీలక విభాగాలను అప్పగించవద్దని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ప్రతి విభాగానికి రెగ్యులర్ అధికారి బాధ్యత వహించేలా విధులు కేటాయించాలని సూచించారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలు, యంత్రాలను పరిశీలించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, కమిషనర్ దశరథ్, ఇంజినీరు గోపాల్ తదితరులు ఉన్నారు.

12 రోజులైనా జాడే లేదు

ఇంకా లభించని ఎస్ఎల్‌బీసీ కార్మికుల ఆచూకీ



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద నమూనా టీబీఎంను పరిశీలిస్తున్న అధికారులు

- టన్నెల్ వద్ద కనిపించని అధికారుల హడావుడి
- మళ్లీ పని చేయని కన్వేయర్ బెల్టు
- లోకో ట్రైన్ ద్వారానే మట్టి, ఇతర వ్యర్థాల తరలింపు
- సహాయక బృందాల మధ్య కొరవడిన సమన్వయం

అచ్చంపేట/అమ్రాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల వెలికితీతపై ఉత్కంఠ వీడటం లేదు. 12 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నా కార్మికుల ఆచూకీ లభించలేదు. రోజు మాదిరిగానే బుధవారం రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు కొనసాగించాయి. కొన్ని రోజులుగా కష్టపడి పునరుద్ధరించిన కన్వేయర్ బెల్టు మళ్లీ తెగిపోయింది. సొరంగంలోని మట్టి, ఇతర వ్యర్థాలను లోకో ట్రైన్ ద్వారానే తరలిస్తున్నారు. సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో నీటి ఊట ఏ మాత్రం తగ్గలేదు. టన్నెల్‌లో ఉబికి వస్తున్న నీటి ఊటతో డ్రిల్లింగ్ పనులు ముందుకు సాగడం లేదు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, ఇతర సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. జీపీఆర్ ద్వారా మానవ అవశేషాలను గుర్తించిన ప్రాంతాల్లో బురద, మట్టి ఇతర వ్యర్థాల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. అయితే సహాయక బృందాల మధ్య సమన్వయం కొరవడటంతో, ఎవరికి వారు ఇక్కడ.. అక్కడ అన్నట్టుగా పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యలు ఇలాగే కొనసాగితే మరో 10 రోజులైనా సొరంగంలో చిక్కుకున్న వారిని బయటికి తెచ్చే పరిస్థితి కనిపించడం లేదు. లోకో ట్రైన్ 13.5 కిలోమీటర్ల వరకు వెళ్తుండటంతో మట్టి, రాళ్లతో పాటు కట్‌చేసిన టీబీఎం మెషీన్ విడి భాగాలను బయటకు తరలిస్తున్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వచ్చి వెళ్లిన నాటి నుంచి అధికారుల హడావుడి అంతగా కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



లోకో ట్రైన్‌లో టన్నెల్ నుంచి బయటకు వస్తున్న రెస్క్యూ బృందం

ఒకడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు

టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను బయటికి తీసుకు రావడం కష్టతరంగా మారుతోంది. టన్నెల్‌లో దుర్వాసన వస్తుండటంతో సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితిలో సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పేరుకుపోయిన మట్టి, శిథిలాలకు తోడు నీటి ఊట ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఒక అడుగు ముందుకు పడితే.. రెండు అడుగులు వెనక్కి పడుతున్నాయని రెస్క్యూ బృందాలు వాపోతున్నాయి. గతనెల 22 నుంచి వివిధ విభాగాలకు చెందిన సహాయక బృందాలు సొరంగంలో జల్లెడ పడుతున్నా కార్మికుల ఆనవాళ్లు లభించడం లేదు. సొరంగం కూలిన ప్రాంతంలో భూ ప్రకంపనలకు గల అవకాశాలను నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఇందుకు సంబంధించిన నివేదిక అందించాల్సి ఉంది. కాగా, కార్మికుల వెలికితీతకు చేపట్టాల్సిన చర్యలపై రెస్క్యూ బృందాల ప్రతినిధులతో విపత్తుల నిర్వహణ స్పెషల్ చీఫ్ అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా టీబీఎంను పరిశీలించారు.

తిండికీ తిప్పలే..

నల్లమలలోని చెంచు మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత

- నిత్యం కారం, తొక్కులే ఆహారం
- చెంచు మహిళల్లో 60 శాతం మందికి ఎనీమియా సమస్య
- గర్భిణులు, బాలింతల్లో రక్తం లేక పెరుగుతున్న శిశుమరణాలు

'నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న రాంపూర్‌పెంటకు చెందిన గర్భిణి బయమ్మ(25)ను ఇటీవల డెలివరీ కోసం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి ఆమెకు హిమోగ్లోబిన్ 4 శాతమే ఉన్నట్టు గుర్తించారు. రక్తం ఎక్కించడంతో పాటు అత్యవసర చికిత్స అందించి డెలివరీ చేశారు. అయితే 8 రోజుల అనంతరం పుట్టిన శిశువు చనిపోయాడు.' ఇలా నల్లమలలో రక్తహీనత సమస్యతో అధికశాతం చెంచు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నల్లమలలోని కొమ్మెనపెంటలో చెంచు మహిళలు

నల్లమలలో చెంచుల ఆవాసాలు: 88	చెంచు కుటుంబాలు 2,595	చెంచుల జనాభా 8,784	స్త్రీలు: 4,443
			పురుషులు: 4,341

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నల్లమలలోని చెంచు మహిళలు, చిన్నారుల్లో అధికశాతం మందిని రక్తహీనత సమస్య వేధిస్తోంది. సరైన పౌష్టికాహారం లేక చెంచులు తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్నారు. దీంతో గర్భిణులకు ప్రసవ సమయంలో వేదన తప్పడం లేదు. కొన్ని సార్లు పుట్టిన శిశువులు సైతం మృత్యువాత పడుతుండటం కలచివేస్తోంది. మహిళల్లో హిమోగ్లోబిన్ శాతం కనీసం 12 వరకు ఉండాలి, అయితే చెంచు మహిళలు, గర్భిణులు, బాలింతల్లో 60 శాతానికి పైగా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. 25 శాతం మంది మహిళలు 9 శాతం కన్నా తక్కువ రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కేసుల్లో 3–6 శాతం మాత్రమే హిమోగ్లోబిన్ ఉంటున్న తీవ్రమైన ఎనీమియా కేసులు చోటుచేసుకుంటున్నాయి. నల్లమలలోని చెంచు మహిళల్లో రక్తహీనత సమస్యపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్(ఎన్ఐఎన్) హైదరాబాద్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించింది. శిశువులు నెలలు నిండక ముందే జన్మించడం, తక్కువ బరువుతో జన్మించడం, శిశు మరణాలు, పురుషులతో పాటు మహిళల్లోనూ ఆల్కహాలిక్ లివర్ సిర్రోసిస్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు గుర్తించింది. అడవినే నమ్ముకుని జీవనం గడుపుతున్న చెంచుల జీవితాలు సరైన తిండి, ఆదాయం లేక మరింత దుర్భరంగా మారుతున్నాయి.

బర్త్ వెయిటింగ్ సెంటర్లతో ప్రయోజనం..

చెంచుపెంటల్లోని మహిళలకు రేషన్‌బియ్యం, పప్పులు, గుడ్లు తదితర ఆహారం అందించేందుకు అప్పాపూర్‌లోని ఏకైక అంగన్‌వాడీ కేంద్రమే ప్రధాన దిక్కుగా మారింది. ఇక్కడి నుంచి 20, 30 కి.మీ. దూరంలో ఉన్న చెంచుపెంటలకు సరుకుల రవాణా జరగడం లేదు. అంగన్‌వాడీల ద్వారా ప్రతి చెంచు పెంటల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు ఇంటింటా కూరగాయల మొక్కలతో కిచెన్‌గార్డెన్‌ను ప్రోత్సహించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రక్తహీనత సమస్యతో గర్భిణులు, శిశు మరణాలను తగ్గించేందుకు బర్త్ వెయిటింగ్ సెంటర్లను నెలకొల్పి, అవసరమైన వారిని ముందస్తుగా అక్కడి తరలించి పౌష్టికాహారం, చికిత్స అందిస్తే ప్రయోజనం ఉంటుందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

కారం, తొక్కులే నిత్య భోజనం..

నల్లమలలో మొత్తం 88 చెంచు ఆవాసాలు ఉండగా, చెంచుల మొత్తం జనాభా 9 వేల లోపే. ప్రభుత్వం వీరి సంక్షేమం, జీవన ప్రమాణాలు పెంచేందుకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, వాస్తవంలో చెంచులు కనీసం సరైన తిండికీ నోచుకోవడం లేదు. చెంచుల్లో చిన్నారులు, మహిళల నుంచి పెద్దల వరకు నిత్యం కారం, తొక్కులతోనే కాలం గడుపుతున్నారు. అప్పాపూర్, భౌరాపూర్, మేడిమల్కల తదితర చెంచుపెంటల నుంచి కూరగాయలు కావాలంటే సుమారు 40 కి.మీ.దూరంలో ఉన్న మన్ననూరుకు వెళ్లాల్సి ఉంటుంది. పదిహేను, నెలరోజులకు ఒకసారి తెచ్చుకున్న కూరగాయలు, సరుకులతోనే సరిపెట్టుకుంటున్నారు. అటవీ అధికారుల ఆంక్షల నేపథ్యంలో తేనె, చెంచుగడ్డలు తదితర ఆహారం వారికి అరకొరగా దొరికినా, వాటిని ఆహారంగా తీసుకోకుండా ఇతరులకు విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు.



కొమ్మెనపెంటలో చెంచుల ఆవాసాలు(బొడ్డు గుడిసెలు)

తొక్కు, చింతపులుసే తింటాం..



మేం ఎక్కువగా కారం, తొక్కులు, చింతపులుసు తింటాం. మా పిల్లలు కూడా అవే తింటారు. కూరగాయలు కావాలంటే మన్ననూరుకు పోయి తెచ్చుకుంటాం. 15 రోజులు, నెలకు ఒకసారి వెళ్లి తెచ్చుకుంటాం. వారం తర్వాత కూరగాయలు పాడవుతాయి. ఎక్కువ రోజులు కారం పొడి, తొక్కు వేసుకుని అన్నం తింటాం.

– దంసాని ఈదమ్మ, కొమ్మనపెంట, అమ్రాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లా

సరైన ఆహారం లభించట్లేదు..



చెంచులు ఎక్కువగా రైస్, కారం, తొక్కులపైనే ఆధారపడుతున్నారు. కూరగాయలు, కూరలు, పౌష్టికాహారం లేక రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. పుట్టిన శిశువులు రక్తహీనతతో 2 నుంచి 2.5 కిలోల లోపే జన్మిస్తున్నారు. చలికాలంలో న్యూమోనియా, ముక్కు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలతో శిశు మరణాలు చోటు చేసుకుంటున్నాయి.

– డాక్టర్ సైపుల్లా ఖాన్, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

కొత్తకోట రూరల్: కారు డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. వివరాలు.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పట్టణానికి చెందిన కనికాపురం రామయ్య, అతని భార్య వసంత, కుమారుడు లోకేష్ హైదరాబాద్‌లో బంధువుల పెళ్లి ఉండటంతో సొంత కారుకు డ్రైవర్‌గా మల్లికార్జునను తీసుకొని బయలుదేరారు. బుధవారం తెల్లవారుజామున కారు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటవెల్లి సమీపంలోకి రాగానే డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా నడిపాడు. ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని బలంగా ఢీకొనడంతో కారు ముందు సీట్లో ఉన్న రామయ్య(58) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్‌తో పాటు వెనుక సీట్లో ఉన్న వసంత, లోకేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి కుమారుడు సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లోకేష్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

గద్వాల క్రైం: తీవ్రమైన తలనొప్పి, నరాల బలహీనతతో బాధపడుతున్న ఓ వివాహిత మనస్తాపం చెందిన ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని పరుమాలలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుమతి (34) కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికొచ్చిన భర్త నరేష్ గమనించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని ఏనుగొండకు చెందిన కె.నరేష్‌కుమార్(29) మంగళవారం రాత్రి 11.30 ప్రాంతంలో ఏనుగొండ సమీపంలో రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నరేష్‌కుమార్ కొన్ని రోజుల నుంచి ఉపాధి కోసం ప్రయత్నం చేయగా ఎలాంటి పని దొరకపోవడంతో పాటు ఆరోగ్య సమస్య వల్ల మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

■ రైలు ఢీకొట్టడంతో గాయాలైన క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నెల 1న మధ్యాహ్నం కొకుంట్ల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని (45) రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు.

రహదారి భద్రతపై సుప్రీం కమిటీ

- రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి
- భద్రత చర్యలపై తీసుకున్న నిర్ణయాలపై నివేదికలు పంపండి
- విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్


మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రహదారి భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ నియమించినట్లు రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకితో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, వైద్యారోగ్య, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరిగే రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, ఎస్పీ, ఆర్ అండ్‌బీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాల్లో రహదారి భద్రతపై సమావేశాలు నిర్వహించి తీసుకున్న చర్యలపై ఆయా శాఖల అధికారులు రవాణా శాఖ కమిషనర్ కార్యాలయానికి నివేదికలు సమర్పించాలన్నారు. సుప్రీం కోర్టు కమిటీకి నివేదిక సమర్పించాల్సి ఉంటుందని, ఈ అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గతేడాది జిల్లాలో 108 రోడ్డు ప్రమాదాలు జరిగినట్టు డేటా ఉందని, ఆయా శాఖలు డేటా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 19 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్నవారు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆయన వివరించారు. పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వం నవంబర్ 16, 2024 నుంచి ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు వంద శాతం మినహాయింపు చేసిందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న రోజుల్లో రోడ్డు భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ దేశ్యానాయక్, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి భద్రతకు భరోసా

- సవితి తల్లి వేధింపులు
- పోలీసులను ఆశ్రయించిన చిన్నారి
- అక్కున చేర్చుకున్న ఎస్పీ


ఎస్పీ రావుల గిరిధర్‌కు తన గోడు వివరిస్తున్న బాలుడు, మేనమామ

వనపర్తి: సవతి తల్లి వేధింపులతో పసి బాలుడి హృదయానికి గాయమైంది. పోలీసులు చిన్నారిని ప్రేమతో ఓదార్చారు. వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అక్కున చేర్చుకొని నీకు మేము ఉన్నాం అంటూ భరోసా ఇచ్చారు. వివరాలు.. పెబ్బేరు మండలం సూగూరుకికి చెందిన గొల్ల నరసింహా, వనిత దంపతులకు తొమ్మిదేళ్ల బాలుడు ఉన్నాడు. వనిత అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మరణించింది. పెద్దల బలవంతంపై నరసింహా సమీప బంధువైన లక్ష్మిని రెండో వివాహం చేసుకున్నాడు. పెళ్లైన కొత్తలో లక్ష్మి ఆబాలుడిని బాగానే చూసుకునేది. కాలం గడిచేకొద్ది ఆ చిన్నారిని చీటికిమాటికీ చిత్రహింసలకు గురిచేసేది. నిప్పులో కాల్చిన సలాకితో అతడి తొడలపై వాతలు పెట్టింది. ఈ విషయాన్ని ఆచిన్నారి తండ్రికి చెప్పినా ఆమె అరాచకానికి అడ్డుకట్ట వేయలేకపోయాడు. మంగళవారం సవతితల్లి అకారణంగా చితకబాదగా ఆవిషయాన్ని ఆ అబ్బాయి తన మేనమామ రామచంద్రయ్యకు ఫోన్ ద్వారా తెలిపాడు. అతడు బాలుడిని తీసుకొని ఎస్పీ కార్యాలయానికి వచ్చాడు. సవతి తల్లి పెట్టిన ఇబ్బందులు, హింసను రామచంద్రయ్య ఎస్పీకి వివరించారు. దెబ్బలను గుర్తుకు తెచ్చుకొని కన్నీటి పర్యంతమైన బాలుడిని ఎస్పీ చేరదీసి అల్పాహారాన్ని అందజేసి ఓదార్చారు. అనంతరం అతడితో సమాచారమంతా రాబట్టారు. రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధికారి, జిల్లా బాలల పరిరక్షణాధికారి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ల ద్వారా బాలుడు ఎదుర్కొన్న మనోవేదనను, చిత్రహింసల వివరాలను సేకరించాలని కోరారు. వారి నివేదిక ఆధారంగా నిందితురాలిపై పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నారు. బాలుడిలో మనోధైర్యాన్ని కలిగించి ఏదైనా పాఠశాలలో చేర్పిస్తామని ఎస్పీ తెలిపారు.

నకిలీ పోలీసులతో అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ రాములు



మాట్లాడుతున్న ఏఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ క్రైం: డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేయడానికి నకిలీ సీబీఐ, ఆదాయపు పన్ను, పోలీస్ అధికారులంటూ భయాందోళనకు గురి చేయడానికి చూస్తుంటారని వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్పీ రాములు అన్నారు. సైబర్ నేరాలపై బుధవారం ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మీ బ్యాంక్ ఖాతా టెర్రరిస్టులతో లింక్ అయ్యిందని, మనీలాండరింగ్ కేసులో మీ పేరు ఉందని భయపెడుతూ మెసేజ్‌లు చేస్తారని వెల్లడించారు. ఖాతాలు ఫ్రీజ్ కాకుండా ఉండాలంటే వాళ్లు చెప్పిన ఖాతాల్లో డబ్బులు బదిలీ చేయాలని మోసం చేస్తుంటారన్నారు. పోలీసులు ఎప్పుడూ కూడా ఫోన్‌లలో కేసులపై విచారణచేయడం జరగదని, ఫోన్‌లలో డబ్బులు అడగటం ఉండదని తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలు కావడంతో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల పేరుతో భయపెడుతారని, స్మార్ట్‌ఫోన్లలో యాప్‌ల వాడకంపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థినులను అధికంగా భయపెడతారని, వేధింపులకు గురైతే సైబర్ పోలీసులకు, 1930 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు 8712672222కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం సైబర్ క్రైం డీఎస్పీ సుదర్శన్ వైద్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. సైబర్ క్రైం సీఐ గోపాల్, రూరల్ సీఐ గాంధీనాయక్, ఐటీ సెల్ ఎస్‌ఐ రవి పాల్గొన్నారు.

ఏడాది గడిచినా అందని పరిహారం

- కేఎల్‌ఐ కాల్వ పనులను అడ్డుకున్న తాడూరు రైతులు


కేఎల్‌ఐ కాల్వ పనులను అడ్డుకున్న తాడూరు రైతులు

ఉప్పునుంతల: మండలంలో కేఎల్‌ఐ కాల్వ పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా తమ భూములకు పరిహారం అందని లేదని తాడూరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తాడూరు గ్రామ శివారులో సాగుతున్న కేఎల్‌ఐ కాల్వ పనులను వారు అడ్డుకున్నారు. రెండు పర్యాయాలు స్థానిక ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరిస్తే పరిహారం డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు డబ్బులు అందలేదని రైతులు గున్నమోని లింగమయ్య, శంకరయ్య, లక్ష్మయ్య, బక్కయ్య, నీరంజన్, రాములమ్మ, బొడ్డుపల్లి చంద్రయ్య, పంగ వెంకటయ్య తెలిపారు. పక్కనే ఉన్న అచ్చంపేట మండలం పులిజాల లో రైతులకు పరిహారం అందించారని, తమకు డబ్బులు ఇవ్వడంతో జాప్యం చేస్తున్నారని వాపోయారు. పరిహారం ఇచ్చేంత వరకు పనులు చేయకూడదని అక్కడున్న సూపర్‌వైజర్లకు, కూలీలకు రైతులు చెప్పారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయాలంటూ రైతుల ఆందోళన

- చివరి ఆయకట్టుకు నీరు అందడంలేదని వాదన
- కోతలు విధించలేమన్న అధికారులు
- విద్యుత్ సిబ్బందితో వాగ్వాదం


అల్వాలపాడు సబ్‌స్టేషన్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కేటీదొడ్డి మండల రైతులు

ధరూరు : వ్యవసాయానికి కరెంటు ఇవ్వాలని పోరాడిన ఘటనలు ఇప్పటివరకు చూశాం.. కానీ వ్యవసాయానికి కరెంట్ కట్ చేయాలంటూ రైతులు ఆందోళన బాట పట్టిన వింత ఘటన ధరూరు మండలంలో చోటుచేసుకుంది. నిరంతరాయంగా కరెంటు ఇవ్వడంతో నెట్టెంపాడు కాల్వ కింద ఉన్న రైతులకు నీరందడం లేదని, పగలు రెండు లేదా మూడు గంటలు కరెంట్ సరఫరా నిలిపివేయాలని, రాత్రివేళ పూర్తిగా బంద్ చేయాలని రైతులు అల్వాలపాడు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. 104 కాల్వకు నీళ్లు వస్తున్నందున చివరి ఆయకట్టులో ఉన్న కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె, వెంకటాపురం, ఈర్లబండ గ్రామాల రైతులకు ర్యాలంపాడు నుంచి విడుదలయ్యే నీరు అందడం లేదన్నారు. కాల్వ ముందు భాగంలో ఉన్న పొలాలకే నీళ్లు వస్తున్నాయంటూ విద్యుత్ సిబ్బందితో రైతులు వాగ్వాదానికి దిగారు. విషయాన్ని ఏఈ, ఏడీఈలకు ఫోన్‌లో సమాచారమివ్వగా వారు అక్కడి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడం అన్నది తమ చేతుల్లో లేదని, ఈవిషయంలో తామేమీ చేయలేమని వారు తేల్చి చెప్పారు. దీంతో రైతులు కలెక్టర్‌కు విన్నవిస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

క్రేన్ మరమ్మతులకు వచ్చి.. హత్య చేశాడు

- బిహార్ కూలీ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో నిందితుడి అరెస్ట్
- డీఎస్పీ వెంకటేశ్వర్లు


హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిత్రంలో సీఐ కమలాకర్, ఎస్‌ఐలు

జడ్చర్ల: ఓ పరిశ్రమలో భారీ క్రేన్‌ను మరమ్మతు చేయడానికి వచ్చిన వ్యక్తి హత్యకు పాల్పడ్డాడు. హత్య చేసిన నిందితుడు పరారీ కాగా పోలీసులు ఛేదించి పట్టుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిందితుడు వినయ్ క్రేన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని పెద్దపల్లి గ్రామ శివారులో గల విర్కో బల్క్‌డ్రగ్ కంపెనీలో క్రేన్ మరమ్మతులకు గురైంది. దీని రిపేర్ చేసేందుకు గత నెల 24వ తేదీన పూణే నుంచి వినయ్ జడ్చర్లకు వచ్చాడు. అదేరోజు క్రేన్‌ను పరిశీలించి మరమ్మతుకు అవసరమైన విడిభాగాలను తెప్పించేందుకు క్రేన్ యజమానికి సమాచారమిచ్చి రాత్రికి పూణేకు బయలుదేరేందుకు సిద్ధమయ్యాడు. అయితే క్రేన్ ఆపరేటర్స్ ఉండేందుకు బీఆర్‌రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన రూంలో అతడు బసచేశాడు. పూణే వెళ్లేందుకు గది నుంచి బయటకొచ్చి మెట్లపై కూర్చున్నాడు. మెట్లు ఎక్కే క్రమంలో మద్యం మత్తులో ఉన్న హతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన కూలి రషీద్‌ఖాన్ నిందితుడు వినయ్‌ను తాకుతూ వెళ్లాడు. ఈక్రమంలో వారి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. రషీద్‌ఖాన్ తలను వినయ్ గోడకేసి బాదడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. మృతుడి సెల్‌ఫోన్‌ను తీసుకొని నిందితుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బీఆర్‌రెడ్డి గార్డెన్‌లో నివాసం ఉంటున్న కూలీలను విచారించారు. వినయ్ కనిపించకపోవడంతో అనుమానం వచ్చి అతడి యజమానిని విచారించగా అసలు విషయం బయటపడింది. హత్య అనంతరం వినయ్ యజమానితో జరిగిన విషయం చెప్పాడు. దీంతో అతడు పోలీసులకు లొంగిపోవాలని యజమాని సూచించాడు. నిందితుడు మాత్రం అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో నిందితుడిని అరెస్ట్‌చేశారు. హతుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ కమలాకర్, ఎస్‌ఐలు మల్లేష్, చంద్రమోహన్, జయప్రసాద్ పాల్గొన్నారు.

చిరుత కోసం బోను ఏర్పాటు


చిరుత సంచారం గుర్తించడానికి ఏర్పాటుచేసిన సీసీ కెమెరా


మోమినాపూర్ శివారులో బోను ఏర్పాటుచేస్తున్న అటవీ శాఖాధికారులు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు, దామరగిద్ద మండలాల్లో కొన్నినెలలుగా చిరుత సంచరిస్తోంది. రెండు మండలాల్లో తరుచూ ఎక్కడో ఓ చోట చిరుత లేగదూడలను, మేకలను చంపుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో అటవీ శాఖాధికారులు మోమినాపూర్, కంసాన్‌పల్లి, బొమ్మన్‌పాడ్ శివారులోని గుట్టల దగ్గర బోను ఏర్పాటుచేశారు. వాటి కదలికలను గుర్తించడానికి అడవిలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు మద్దూరు సెక్షన్ అధికారి లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి, దామరగిద్ద మండలాల్లో దాదాపు 4చిరుతల సంచారం ఉందని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతాల్లో మూడు చిరుతలు మృతిచెందగా, ఒక చిరుత బోనుకు చిక్కింది. మోమినాపూర్, దుప్పట్‌గట్, జాధరావ్‌పల్లి, నందిపాడ్, నందిగామ గుట్టల్లో చిరుతల సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నెల రోజుల లోపే మోమినాపూర్‌లో చిరుతల వరుస ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో బోను, సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. మిగితా ప్రాంతాల్లో మాత్రం బోన్లు ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిరుత దాడిలో దూడ మృతి..

మద్దూరు: చిరుత దాడిలో దూడ మృతి చెందిన ఘటన మోమినాపూర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు కులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గూళ్ల హన్మంతు మంగళవారం రాత్రి తన పొలం దగ్గర మిగతా పశువులతో పాటు దూడ కట్టేసి ఇంటికొచ్చాడు. ఉదయం పొలానికెళ్లి చూడగా దూడ మృతి చెందినట్లు గుర్తించారు. చిరుత దాడిలో దూడ మృతిచెందినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌నాయక్ ధ్రువీకరించారు.


గుండాల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- గుండాలలో మార్మోగిన శివనామ స్మరణ
- భక్తి పారవశ్యంలో భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు


కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలో బుధవారం తెల్లవారుజామున శ్రీఅంబా రామలింగేశ్వర స్వామి పెద్ద రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద రథోత్సవంను పూలతో అలంకరణ చేసి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీరగా భక్తులు పోటాపోటీగా రథాన్ని లాగారు. శివనామస్మరణతో గుండాల గ్రామం మార్మోగింది. రథంపై ఊరేగుతున్న ఆదిదపంతులను భక్తులు దర్శించుకొని భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. రథోత్సవం సందర్భంగా సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి భక్తులకు సచ్చజెపుతూ ఎస్‌ఐలు కృష్ణాదేవా, మహేందర్, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, వీరేశంశర్మ, శివకుమార్‌శర్మ, నరహరిశర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు అంజయ్య, మల్లేష్ ముదిరాజ్ ఉన్నారు.

మైసమ్మ సన్నిధిలో డీఐజీ చౌహాన్

- ఆలయంలో ప్రత్యేకపూజలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ చైర్మన్, అధికారి


పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారి చెంత డీఐజీ చౌహాన్

నవాబుపేట: ప్రసిద్ధి చెందిన పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయాన్ని బుధవారం డీఐజీ చౌహాన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి, ఆలయ అధికారి నర్సింహులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ చౌహాన్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన అడవిలో వెలసిన అమ్మవారి చెంత చాలా ప్రశాంతత ఉందన్నారు.

మైసమ్మ టెండర్ల ఆదాయం రూ. 51 లక్షలు..

పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో విక్రయించే టెంకాయలు, పూజా సామగ్రి తదితర వాటికి సంబంధించిన టెండర్ల ద్వారా రూ. 51 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవాలయ చైర్మన్ జనగ్‌మోహన్‌రెడ్డి, ఆలయ అధికారి నర్సింహులు తెలిపారు. బుధవారం మైసమ్మ దేవాలయ ఆవరణలో నిర్వహించిన టెండర్లలో టెంకాయలకు సంబంధించి రూ.31.83లక్షలకు పాశం వెంకటేష్ టెండర్ దక్కించుకున్నాడు. వాహన పూజ సామగ్రికి రూ.14.07లక్షలు, పూల విక్రయానికి రూ. 5.67లక్షలకు కాకర్లపహాడ్‌కు చెందిన అంకం ఆంజనేయులుకు లభించాయి. వీరంతా వచ్చే నెల నుంచి దేవాలయంలో నూతన విక్రయాలు చేసేందుకు అనుమతి ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణదరి, గోపాల్, అనుసూయమ్మ, అంజనేయులు, మల్లేష్, బాలయ్య, రమేష్, రాజు, నరేష్, వెంకటేష్, రాములుపాల్గొన్నారు.


ఉల్లి కుప్పలతో నిండిపోయిన దేవరకద్ర మార్కెట్

పోటెత్తిన ఉల్లి

- ఉల్లి కుప్పలతో నిండిన దేవరకద్ర మార్కెట్
- గరిష్ట ధర రూ. 2,550
- కనిష్టంగా రూ. 1,800

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌కు బుధవారం ఉల్లి పోటెత్తింది. వివిధ గ్రామాల నుంచి రైతులు ఉల్లిని పెద్ద ఎత్తున అమ్మకానికి తెచ్చారు. దాదాపు ఐదు వేల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో మార్కెట్ యార్డు ఆవరణం అంతా ఉల్లి కుప్పలతో నిండిపోయింది. స్థలం సరిపోక గోదాంల పక్కన సీసీ రోడ్డుపై ఉల్లిని కుప్పలుగా పోశారు. ప్రస్తుతం సీజన్ కావడంతో కోతలు కోసిన ఉల్లిని రైతులు నేరుగా మార్కెట్‌కు తెస్తున్నారు. దిగుబడులు ఎక్కువగా వస్తుండటంతో ఒక్కో రైతు రెండు నుంచి మూడు ట్రాక్టర్ల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. ఎండలు బాగా ఉండడంతో బాగా ఆరబెట్టిన నాణ్యమైన ఉల్లి మార్కెట్‌కు వచ్చింది.

జోరుగా కొనుగోళ్లు

దేవరకద్ర మార్కెట్లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వేలం పాటలు మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగింది. ఉల్లి ఎక్కువ రావడంతో వ్యాపారులు ప్రతి కుప్ప వద్దకెళ్లి వేలం పాట పాడాల్సి వచ్చింది. మొదటి రకం ఉల్లికి గరిష్టంగా రూ.2550, కనిష్టంగా రూ.1800 వరకు ధర పలికింది. గత వారంతో పోల్చితే ధరలు నిలకడగానే ఉన్నాయి. స్థానిక వ్యాపారులతో పాటు బయట నుంచి వచ్చిన వ్యాపారులు పోటీపడి ఉల్లిని కొనుగోలు చేశారు. వేలాది బస్తాల ఉల్లిని బయటి వ్యాపారులే ఎక్కువగా ఖరీదు చేశారు. చిరు వ్యాపారులు కూడా చిన్నచిన్న కుప్పలను కొనుగోలు చేశారు. ఇక స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని వినియోగ దారులకు బస్తాలుగా అమ్ముకున్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం తూకం వేసిన 45 కేజీల ఉల్లి బస్తా ధర గరిష్టంగా రూ. 1300, కనిష్టంగా రూ. 900 వరకు విక్రయించారు.